ప్రజాశక్తి

గురువారం 8 డిసెంబర్ 2022

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

పట్టాలేకున్నా.. పట్టభద్రుల ఓటర్లే..!

- ముసాయిదాలో నిరక్షరాస్యుల పేర్లు
- అధికార పార్టీ ఒత్తిళ్లతో విపరీత పొరపాట్లు
- సరి చేయాలంటూ పెరుగుతున్న వినతులు
- అనర్హులను తొలగించాలని డిమాండ్
- రేపటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ



ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదైన నిరక్షరాస్యులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాలో గతంలో ఎన్నడూలేని తప్పిదాలు ఈసారి చోటుచేసుకున్నాయి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు అధికార పార్టీ నాయకులు లక్ష్యాలు విధించి ఓటర్ల నమోదు చేయించారు. దీంతో విద్యార్హతలు, వయస్సు పరిగణనలోకి తీసుకోకుండా నమోదు చేయడంతో విపరీతమైన తప్పులు దొర్లాయి. ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, వ్యక్తిగత దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువు ఈ నెల తొమ్మిదితో ముగియనుంది. అధికార పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఒత్తిడిచేసి నమోదు చేయించిన అనర్హుల ఓటర్లను గుర్తించి, అభ్యంతరం తెలియజేసేందుకు ప్రస్తుత గడువు ఏ మాత్రమూ సరిపోయేలాలేదు. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో 2.67 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నమోదుచేసుకున్న వారిలో వేలాది మంది అనర్హులు, ఒకటికంటే ఎక్కువసార్లు పేర్లు నమోదైనవారు ఉన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం వారి అర్హతలను గుర్తించి అభ్యంతరాలు ఇచ్చేసరికి గడువు ముగియనుంది. మరొక్కరోజే అభ్యంతరాల స్వీకరణ గడువు వుండడంతో.. ఈ గడువులోగా అభ్యంతరాలు ఇవ్వలేక పోయినా, అధికారుల పరిశీలన సరిగాలేకపోయినా 30న విడుదల చేయనున్న తుది జాబితాలో అనర్హులు కొనసాగనున్నారు. ఇప్పటికే విశాఖపట్నం జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాలోని లోపాలను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ, కోశాధికారి బిబి.గణేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముసాయిదా ఓటర్ల మిగతా 2లో..

ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండల్లో..

భూ దోపిడీపై ఎందుకు స్పందించరు ?

- జెసి పర్యటించినా చర్యల్లేవు
- 'స్పందన'లో జివిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త అల్లూరి పార్వతి
- రెవెన్యూ, జివిఎంసి జాయింట్ సర్వే చేస్తామని కమిషనర్ హామీ



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న పార్వతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'అక్రమాలకు పాల్పడిన స్థలాల్లో స్వయంగా జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారి అయిన జాయింట్ కలెక్టర్ పర్యటించి వెళ్లి నెలలు గడుస్తున్నా ఇంతవరకూ చర్యల్లేవు. చెరువులను కప్పేసి రోడ్లేసేశారు ? ప్రభుత్వ డి పట్టా భూముల్లో కొబ్బరి తోటలు వేసేసుకుని 'అక్రమ ఎస్టేట్'లు నిర్మించుకున్నారు ? రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడల్లో చెరువులు, గెడ్డలను అమ్మేసుకుని రూ.కోట్లకు పడగలెత్తారు. వీటిపై రెవెన్యూ, జివిఎంసి మిగతా 2లో..

8 మందికి షోకాజ్ నోటీసులు

వార్త 2లో..

నేడు కొండగుడి మేరీ మాత ఉత్సవం

వార్త 2లో..



రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోయిన విద్యార్థిని

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

పట్టాలేకున్నా.. పట్టభద్రుల ఓటర్లే..!

జాబితాలో 2,163 మంది అనర్హుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువసార్లు 8,486 మంది పేర్లు నమోదైనట్లు ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ (న్యూఢిల్లీ), రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తెలియజేశారు.

అనకాపల్లి జిల్లాలో ఈ తరహా తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. ముసాయిదా జాబితాలో పొరపాట్లను మండల తహశీల్దార్ల దృష్టికి ప్రజా సంఘాలు తీసుకెళ్తున్నాయి. నర్సీపట్నంలో నిరక్షరాస్యులను కూడా పట్టభద్రుల ఓటర్లుగా నమోదుచేశారు. లింగాలపాలేనికి చెందిన మాకిరెడ్డి నానబాబు, మాకిరెడ్డి శారద, అన్నపురెడ్డి శాంతి చదువుకోలేనట్లు ముసాయిదా ఓటరు జాబితాలో వుంది. వీరిని కూలీలుగా నమోదు చేశారు. దోబి కాలనీకి చెందిన కోళ్లన మహిసాయి బన్నీ పేరు రెండుసార్లు, రామారావుపేట డోర్ నెంబరు 9-35-58లోని ఆనంద సుందరం పేరు నాలుగుసార్లు నమోదైంది. నర్సీపట్నం మండలంలోని వేములపూడి పంచాయతీ, అమలాపురం మెయిన్ వీధిలోని పదో తరగతి విద్యార్హత కలిగిన ఊత రమ్య పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో వుంది. పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితాలోని పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన చిత్రవిచిత్రాలు బయటపడుతున్నాయి. ఎక్కువ మంది ఓటర్లను చేర్పించడానికి అధికార పార్టీ నాయకులు చేసిన ఒత్తిళ్లతో అనేక తప్పులుదొర్లాయి. ఈ తప్పులను గడువులోగా పరిశీలించే అవకాశం తక్కువగా వుంది. పేర్ల వారీగా పరిశీలించి అనర్హులను జాబితా నుంచి తొలగించకపోతే వేలాది మంది అర్హులుగా నమోదుకానున్నారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, నర్సీపట్నం ఆర్‌డిఒకు నర్సీపట్నం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.త్రిమూర్తులు, కె.శివనారాయణరాజు లేఖ రాశారు.

భూ దోపిడీపై ఎందుకు స్పందించరు ?

ఎందుకు స్పందించడం లేదో తెలపాలి' అని విశాఖ జిల్లా ఎండాడ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త అల్లూరి పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జివిఎంసిలో కమిషనర్ పి.రాజాబాబు నిర్వహించిన ప్రత్యేక స్పందన (పట్టణ ప్రణాళిక విభాగం)లో ఆమె ఫిర్యాదు చేసి ఆయా ప్రాంతాల్లో భూ ఆక్రమణలకు సంబంధించిన వివరాలన్నిటినీ అందజేశారు.

ఫిర్యాదులో పొందుపరచిన భూ ఆక్రమాల వివరాలు

సర్వే నెంబరు 100లో 3 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. చెరువు 67 నుంచి ఉన్న గెడ్డలన్నిటినీ ఎండాడ, సాగర్‌నగర్‌లో అమ్మేసుకుంటున్నారు. 57, 58, 59, 60, 61, 62, 122, 123, 124, 125ల్లో అక్రమ అమ్మకాలు సాగిపోతున్నాయి. గతంలో ప్రభుత్వం వేసిన సిట్‌లోనూ ఫిర్యాదులు చేశారు. పబ్లిక్ పార్కుకు సంబంధించి ఎండాడలోని ముసలయ్యపాలెంలో మూడు ఎకరాలను ఇలా కబ్జా చేసేశారు. సర్వే నెంబరు 1, 2/1, 34 7/1, 58 నుంచి 62 వరకూ, 100, 118 ముసలయ్యపాలెం పార్కులో మూడు ఎకరాలూ ప్రభుత్వ భూమే. అంతా కబ్జాకు గురైంది. రుషికొండలో 29/1లోని ప్రభుత్వ భూమి 4.97 ఎకరాలు, 29/2లో సుమారు 3 ఎకరాలను చెన్నాదాస్ ఆక్రమించేసి చుట్టూ ప్రహరీ నిర్మించాడు. కొబ్బరి తోటలు వేసుకుని 'రిసార్ట్'లా ప్రభుత్వ భూమిలో దర్జా వెలగబెడుతున్నాడు. సర్వే నెంబరు 67లో చెరువు 1.67 ఎకరాలను ఆక్రమించి మూడు రోడ్లు వేసుకున్నారు. సర్వే నెంబరు 1లో 109 ప్లాట్స్‌ను అక్రమంగా వేసుకోగా 9 మాత్రమే ఖాళీగా ఉన్నాయి. 75 ప్లాట్లకు పట్టాల్లేవు.

విస్మయం చెందిన కమిషనర్

జివిఎంసి కమిషనర్ రాజాబాబు పార్వతి చెప్పిన ఈ అక్రమ చిట్టాలన్నిటినీ విన్నాక కాసేపు విస్మయానికి గురయ్యారు. 'అసలు వీరికి ప్లాన్‌లు ఎవరిచ్చారు ?. రిజిస్ట్రేషన్‌లు ఎలా చేస్తున్నారు' అని ప్రశ్నించారు. 'తప్పు సర్వే నెంబర్లు వాడతారు లేదా చిన్న జిరాయితీ నెంబరును చూపించి మేనేజ్ చేస్తున్నారు' అంటూ పార్వతి సమాధానమిచ్చారు. రుషికొండ స్వర్ణభారతి నగర్‌లో సర్వే నెంబరు 17/1, 2, 5ల్లో ఓపెన్ స్పేస్ పార్కుల్లో ఇలాగే 300 వరకూ అక్రమ ప్లాట్లను చెన్నా దాస్ నిర్మించేసి రూ.కోట్లకు పడగలెత్తిన విషయాన్ని ఉదహరించారు. కమిషనర్ వెంటనే స్పందిస్తూ స్థానిక తహశీల్దార్, జివిఎంసి కలిసి జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడుందో మార్కింగ్ చేస్తామని తెలిపారు. 'మీ వద్దగల ఆధారాలు ఇవ్వండి. మేం చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు.

కెజిహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రముఖ వైద్యశాలైన కెజిహెచ్‌కు ప్రతి రోజూ అనేక మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారని, వారికి కనీస సౌకర్యాలు అందేటట్లు వైద్య సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. బుధవారం కెజిహెచ్‌లోని ఒపి స్లిప్, కేస్ షీట్లు మంజూరు చేసే గదిని, క్యూలైన్లను, పార్కింగ్ ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేస్ షీట్లు మంజూరు చేసే గదికి మరమ్మతులు చేయాలని, అదే విధంగా రోగులు ఒపి స్లిప్‌లు పొందేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోయిన విద్యార్థిని

ప్రజాశక్తి - ఉక్కునగరం, ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య బుధవారం ఓ యువతి ఇరుక్కుపోయింది. రైల్వే, రెస్క్యూ సిబ్బంది సుమారు గంటన్నరసేపు శ్రమించి ఆమెను బయటకు తీశారు. మెరపల శశికళ దువ్వాడ సమీపంలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసిఎ మొదటి సంవత్సరం చదువుతోంది. అన్నవరం దగ్గరగల గోపాలపట్నం గ్రామం నుంచి ప్రతి రోజూ రైలులో రాకపోకలు సాగిస్తోంది. బుధవారం ఉదయం కళాశాలకు వచ్చేందుకు రాయగడ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. రైలు దువ్వాడ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ నెంబర్ 4లో ఆగుతున్న సమయంలో దిగేందుకు ప్రయత్నించగా కాలుజారి రైలు, ప్లాట్‌ఫామ్‌ల మధ్య ఇరుక్కుపోయింది. వెంటనే రైల్వే, రెస్క్యూ సిబ్బంది స్పందించి ఆమె ఇరుక్కుపోయిన చోట ప్లాట్‌ఫారం రెండు బ్లాకులను తొలగించి బయటకు తీశారు.

గాయాలపాలైన ఆమెను కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. సుమారు గంటన్నరసేపు ఆ యువతి విలవిల్లాడిపోయింది. ఆమెను కాపాడిన రైల్వే సిబ్బందిని డిఆర్‌ఎం అనుప్ కుమార్ సత్పతి అభినందించారు.

నేడు కొండగుడి మేరీ మాత ఉత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లోని క్రైస్తవుల ఇలవేల్పుగా పేరొందిన విశాఖ పురి మేరీ మాత (అమలోద్భవి మాత) ఉత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు జరిగాయి. కొండ గుడి ఉత్సవంగా దీనిని పిలుస్తారు. ఈ ఉత్సవంలో మేరీమాతను కొలిచేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనే వేడుకగా దీనికి పేరుంది. ఉత్సవాల్లో భాగంగా నవదిన ప్రార్థనలను నవంబర్ 29 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు నిర్వహించి 8న మహోత్సవం జరుపుతారు. 18వ శతాబ్దం నుంచి విశాఖలో ఈ ఉత్సవాలు జరగడం విశేషం. క్రీస్తు శకం 1850లో రోజ్ అనే ఆంగ్లేయ అధికారి తన నివాసం కోసం నగరంలోని జనసంచారం లేని కొండను కొనుగోలు చేశారు. రోజ్ నుంచి కెప్టెన్ మఫెన్ దీనిని కొనుగోలు చేశారు. ఆయన నుంచి నాటి క్రైస్తవ ఆర్‌సిఎం తీసుకొని క్రీస్తు శకం 1867లో మేరీమాత ఆలయాన్ని నిర్మించి అమలోద్భవి మాత స్వరూపాన్ని అందులో ప్రతిష్టించారు. 1887లో గుడి వెనుక భాగంలో ప్రస్తుతం ఉన్న గుహను నిర్మించారు. ఇక్కడ ఉన్న పాత చర్చి మినహా మిగతా ప్రార్థనాలయాన్ని కూలదోసి ఫాదర్ సిరియల్ కొత్తగా చర్చి నిర్మించారు.

ప్రతి సంవత్సరం డిసెంబర్ 8న జరిగే అమలోద్భవి మాత స్వరూప ఉత్సవ తేరు ఊరేగింపు మహోత్సవానికి ప్రత్యేకత ఉంది.

పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌లోని సెయింట్ అలోషియన్ పాఠశాల నుంచి చర్చి ప్రధాన ఆలయం వరకు ఊరేగింపు ఉంటుంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర భక్తులు తమ భుజాలపై 'తేరు' మోసుకుంటూ మరియమాతను ఆలయానికి చేరుస్తారు. 1974లో భక్తులు పడవ ఆకారంలో తేరును తయారుచేసి మరియ తల్లిని ఊరేగించారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన ఊరేగింపు సమయంలో భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

మూడు రాజధానుల పేరిట మోసం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అసలు బిల్లు లేకుండానే మూడు రాజధానులు అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్న వైసిపి నాయకులపై కేసులు పెట్టాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్ చేశారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు మూడు రాజధానులు అంటూ ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఈ నెల 17న తాను ఢిల్లీ వెళ్లబోతున్నానని, ఇదే విషయమై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వాస్తవానికి గత డిసెంబర్ నెలలోనే మూడు రాజధానుల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో వెనక్కు తీసుకుందన్నారు. బిల్లులో లోపాలను సవరించి పూర్తి స్థాయి బిల్లును మళ్లీ ప్రవేశపెడతామని ప్రకటించిన ప్రభుత్వం ఇంత వరకూ బిల్లును ఎందుకు ప్రవేశ పెట్టలేకపోయిందని ప్రశ్నించారు.

8 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మందికి జిల్లా కలెక్టర్ మల్లికార్జున బుధవారం షోకాజ్ నోటీసులు అందజేశారు. గాజువాక ప్రాంత విఆర్‌ఒ బత్తుల కిరణ్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఈ నెల 5న జరిగిన రోల్ అబ్జర్వర్ సమావేశానికి హాజరు కానందుకు ఈ నోటీసులు అందజేశారు. షోకాజ్ నోటీసు జారీ చేసిన వారిలో జోన్ -2, జోన్-3, జోన్-4 అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు, జోన్-4 జోనల్ కమిషనర్, జోన్-5 టిపి సెక్షన్ డిప్యూటీ సిటీ ప్లానర్, మాడుగుల మండల తహశీల్దార్, గాజువాక జోన్-4 జోనల్ కమిషనర్, పెందుర్తి ఎంపిడిఒ ఉన్నారు.

విమ్స్‌లో పిఆర్‌పి సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ :దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న రోగులకు ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ (పిఆర్‌పి) సెంటర్‌ను విమ్స్ హాస్పిటల్‌లో డైరెక్టర్ కె.రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం కార్పొరేట్ ఆసుపత్రికి పరిమితమైన ఈ పిఆర్‌పి చికిత్స ఇప్పుడు విమ్స్ ఆర్థోపెడిక్ విభాగంలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు ఉచితంగా చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు నామమాత్రపు రుసుముతో ఈ చికిత్సను అందిస్తామని పేర్కొన్నారు. పిఆర్‌పి చికిత్స కలిగిన తొలి ఆసుపత్రిగా రాష్ట్రంలో విమ్స్ నిలుస్తుందన్నారు. ఆర్థోపెడిక్ హెచ్‌ఒడి డాక్టర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ, పిఆర్‌పి చికిత్స ద్వారా దీర్ఘకాలిక నొప్పుల నుంచి తక్షణం ఉపశమనం పొందవచ్చన్నారు. కొంతమంది రోగులకు మాత్రం రెండు సార్లు ఈ చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. 60 ఏళ్ల దాటిన వారిలో సాధారణంగా వచ్చే కీళ్ల నొప్పులు ఈ చికిత్స ద్వారా విముక్తి పొందవచ్చన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు కృషితో ఈ పిఆర్‌పి చికిత్స ఇక్కడ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.



పిఆర్‌పి సెంటర్ ప్రారంభంలో విమ్స్ డైరెక్టర్ రాంబాబు

'పాలనా వికేంద్రీకరణతోనే అభివృద్ధి'

ప్రజాశక్తి -ఆనందపురం : పరిపాలన వికేంద్రీకరణతోనే ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఉత్తరాంధ్ర జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంత లజపతిరావు పేర్కొన్నారు. ఆనందపురం హైస్కూల్ ఇంటర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర అభివృద్ధి పరిపాలనా వికేంద్రీకరణపై బుధవారం సదస్సు నిర్వహించారురు. ఈ సందర్భంగా లజపతిరావు మాట్లాడుతూ, విశాఖ రాజధాని ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పరిపాలన వికేంద్రీకరణను ఉత్తరాంధ్ర జాయింట్ యాక్షన్ కమిటీ స్వాగతిస్తుందన్నారు. ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పుడు అభివృద్ధి ఒక ప్రాంతంలోనే జరిగిందని, తద్వారా ఆంధ్రప్రదేశ్ వెనకబడిపోయిందని తెలిపారు. అదే వరవడి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర, రాయలసీమ బాగా వెనకబడిన ప్రాంతాలవుతాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మేధావుల ఫోరం చైర్మన్ పి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రజలు, మేధావులు, కార్మికులు, విద్యార్థులు ముందుకు రావాలన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేసే వరకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీ పెట్టి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ నిర్మల, అప్పలరాజు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు భీమిలి జట్టు

ప్రజాశక్తి- భీమునిపట్నం : విజయవాడలో ఈ నెల 20, 21 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు భీమిలి నియోజక వర్గ జట్టు ఎంపికైనట్లు జట్టు కెప్టెన్ ఎ.లోవరాజు బుధవారం తెలిపారు. ఎపి సిఎం కప్ పేరుతో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైన జట్టును ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందించారు.

బిసి గర్జన పేరుతో మోసం

ప్రజాశక్తి - యంత్రాంగం

కలెక్టరేట్ : బిసి గర్జన పేరుతో బిసిలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారని టిడిపి జిల్లా నాయకులు ఆరోపించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట టిడిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మీడియాతో మాట్లాడారు. బిసిలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, నగదును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మూడున్నరేళ్లగా జగన్ పాలనలో బిసిలు తీవ్రంగా నష్టపోయారని, బిసి సబ్ ప్లాన్ నిధుల నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకూ ప్రతిచోటా అన్యాయమే జరిగిందని అన్నారు. బిసి విద్యార్థులు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ కోల్పోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో బిసిలను ఓటు బ్యాంకుగా మలచుకుందామనే దురుద్దేశంతో బిసి గర్జన ఏర్పాటు చేశారని, ఈసారి బిసిలు మోసపోరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీభరత్, పాశర్ల ప్రసాద్, లొడగల కృష్ణ, గంటా నూకరాజు, పైలా ముత్యాలనాయుడు, కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

బిసి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించొద్దు

భీమునిపట్నం : బిసి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించొద్దని వైసిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం 'ఇదెం ఖర్మ బిసిలకు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, వెనుక బడిన తరగతులను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసిన ఏకైక పార్టీ టిడిపి అని స్పష్టం చేశారు. గీత, నేత, కమ్మరి, కుమ్మరి తదితర చేతి వృత్తులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేసిన పార్టీ తమదే అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బిసిలకు అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యత కల్పించినట్లు వివరించారు. అనంతరం బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై తహశీల్దార్ కోరాడ వేణు గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా నూకరాజు, పాసి నరసింగరావు, డిఎవిఎన్.రాజు, పైడిపల్లి నరసింగరావు, పతివాడ రాంబాబు, సంకురుభుక్త జోగారావు తదితరులు పాల్గొన్నారు.



భీమిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వైఎస్ఆర్ కడప జిల్లా, ఎర్రగుంట్లలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. దీని కోసం చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో బుధవారం రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా లోని వివిధ పాఠశాలకు చెందిన సుమారు 200 మంది 17 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ఎస్‌జిఎఫ్ కార్యదర్శి సిహెచ్ వెంకటరెడ్డి తెలిపారు. వ్యాయామ సంఘం అధ్యక్షులు కె.సతీష్, ఫిజికల్ డైరెక్టర్లు లలిత్‌కుమార్, రవికుమార్, వెంకటరావు, కిరణ్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయుని వేడుకలు

ప్రజాశక్తి-ఆనందపురం : గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం దత్తాత్రేయుని ఆలయ మందిరంలో దత్తాత్రేయుని జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ జిఎస్ఎన్ రాజు, ఆచార్య చిలుకూరి శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కులో కంచర్ల సినిమా సందడి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ ఆధవర్యాన ముడసర్లోవ పార్కులో బుధవారం సినిమా షూటింగ్ నిర్వహించారు. సినిమా షూటింగ్ కోసం జాతర నిర్వహించారు. రామాయణం, మహా భారతంలో పాత్రదారుల వేషధారణలు, తప్పెటగుళ్ళు, కోలాటం, ఒంటెలు, గుర్రాల ప్రదర్శన, పులి వేషాలు ఈ జాతరలో సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిత్రంలో కథానాయకుడు ఉపేంద్ర, కథానాయిక మీనాక్షితో జాతరలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక్కడ సినిమా షూటింగ్ జరుగుతుందని వనభోజనాలు ఏర్పాటుచేయడంతో ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి జనం రావడంతో పార్కు సందడిగా మారింది.

సంక్షేమ పథకాలతో మేలు

ప్రజాశక్తి -మాధవధార : బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో మేలు జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ పొన్నాడ మోహనరావు అన్నారు. అన్ని కులాలకు సమానంగా చైర్మన్లు, డైరెక్టర్లను నియమించడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ప్రభుత్వంలో 11 మంది బీసీ మంత్రులు ఉన్నారని తెలిపారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేస్తున్న సమయంలో వివిధ పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి అందజేశారని గుర్తు చేశారు. జీవో 58 ద్వారా రజక వృత్తిదారుల అభివృద్ధికి రూ.10000 ఆర్థిక సహాయం అందజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. భారతదేశంలో 18 రాష్ట్రాలలో 4 కేంద్ర పాలిత రాష్ట్రాలలో రజకులు ఎస్‌సిలో ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా వారిని ఎస్‌సిలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో రజకులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పంచాయతీ మున్సిపాలిటీ, కార్పొరేషన్, పరిధిలో షాపులను రజకులకు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. గ్రామాల్లో చెరువులకు రజకులను హక్కుదారులుగా కేటాయించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస వంతెనపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మనాభం మండలం కొత్తకొవ్వాడ గ్రామానికి చెందిన మహంతి అప్పలనాయుడు (72) మృతి చెందాడు. అప్పలనాయుడు వికలాంగుడు. చేతి కర్ర సహాయంతో నడుస్తుండేవాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదుచేశారు. విషయం తెలుసుకున్నా భార్య రావాలమ్మ, ఇద్దరు కుమార్తెలు స్థానిక పోలీసులు సహకారంతో బుధవారం ఆసుపత్రికి చేరుకున్నారు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని భార్య రావాలమ్మ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ రామచంద్రరావు ఆధ్వర్యాన ఎస్ఐ నరసింహమూర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ : తమ్ముడు మృతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : కుటుంబ కలహాల నేపథ్యంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ తమ్ముడు ప్రాణాలు తీసింది. పోలీసుల కథనం ప్రకారం... దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధి శాంతినగర్‌లో ఒక వ్యక్తిపై కత్తితో దాడి జరిగినట్లు మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో డయల్ 100కు ఫోన్ వచ్చింది. పోలీసులు వెళ్లి పరిశీలించారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన కత్యాల శివకుమార్ ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన విశాఖలో ఉంటున్న తన సోదరుడు రమేష్ కుమార్ ఇంటికి వచ్చాడు. సోదరి బాగోగులు చూసే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అప్పటికే మద్యం తాగి ఉండటంతో ఇద్దరి మధ్య గొడవ పెరిగింది. శివకుమార్ తన తమ్ముడు రమేష్‌ను కత్తితో పొడిచి చంపేశాడు. మధ్య తరగతి కుటుంబాలు కావడం, సోదరి భారం ఒక్కరే భరించాల్సి రావడంతో తమ్ముడుపై అన్న కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మడలంలోని అన్నవరం సముద్రతీరం పాండవుల మెట్ట వద్దకు సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని మృతదేహం బుధ వారం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. శరీరం ఉబ్బిపోయి ఉండడంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. విఆర్ఒ ఎవిజె రాజు, విఆర్ఎ ఎస్.నరసింగరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థి భవానికి జ్ఞాపిక అందజేస్తున్న డిఇఒ చంద్రకళ

కళా ఉత్సవ్‌లో చిప్పాడ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి ప్రభుత్వ డైట్‌లో రెండ్రోజులుగా నిర్వహించిన కళా ఉత్సవ్ లో పాల్గొన్న భీమిలి మండలం, చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భవాని తప్పెట గుళ్ల (ఫోక్ డ్యాన్స్)లో అద్భుత మైన ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ అప్పారావు బుధవారం తెలిపారు. సంబంధిత విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థి భవానీని డిఇఒ ఎల్.చంద్రకళ , సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు తదితరులు అభినందించారు. జ్ఞాపిక, సర్టిఫికేట్ అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరి, త్రివేణి, సత్యవతి, ప్రసాదరావు అభినందించారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరావు బుధవారం ప్రారంభించారు. 32 అంశాలను విద్యార్థులు బృందాలుగా ప్రదర్శించారు. ఎటిఎం, ఎసి, వెల్డింగ్ మిషన్లు పనిచేసే నమూనాలను తయారుచేశారు. పర్యావరణం, పీడనం, పట్టణం, పల్లె నమూనాలు ప్రధానంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ, వెంకటరూప, అపరంజి, జయభారతి, అమ్మాజీ, జ్యోతిర్మయి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగాలు వృథా కానివ్వం

స్టీల్ సిఐటియు అధ్యక్షులు అయోధ్యరామ్


మహాసభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం : నిర్వాసితుల త్యాగాలను వృథా కానివ్వబోమని స్టీల్ సిఐటియు అధ్యక్షులు జె.అయోధ్యరామ్ స్పష్టంచేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) వడ్లపూడి ఏరియా కమిటీ 4వ మహాసభను వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా అయోధ్యరామ్ హాజరై మాట్లాడారు. 16,500 కుటుంబాలు 25 వేల ఎకరాల భూమిని త్యాగం చేసి ప్లాంట్ ఏర్పాటుకు సహకరించారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం నుంచి ఇప్పటివరకు సుమారు 250 మంది ఉద్యోగులు తమ ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. సుమారు 8000మంది నిర్వాసితులు నేటికీ ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తే సహించేది లేదని, ఎంత పెద్ద పోరాటాలకైనా, త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ, పోరాటాలకు పురిటిగడ్డ వడ్లపూడి అన్నారు. యూనియన్ నాయకులు పి.నీలకంఠం, మరిడయ్య, విశ్వనాథం మాట్లాడుతూ, నిర్వాసితులకు, కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యూనియన్ అధ్యక్షులుగా కరణంరెడ్డి జగ్గారావు, కార్యదర్శిగా సంతోష్ కుమార్‌రాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మార్పు దానయ్యతోపాటు 15మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వీరాస్వామి, రామశేఖర్, సతీష్, డిఎస్‌విఎస్.శ్రీనివాస్, శివ, పాల అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పద్మ తదితరులు

హంతకుడిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి -గాజువాక : మధురవాడలో అమ్మాయిని చంపి ప్లాస్టిక్ డ్రమ్‌లో ఉంచిన మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి బి పద్మ డిమాండ్ చేశారు. గాజువాక కార్యాలయంలో జరిగిన ఐద్వా జోన్ కమిటీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతుందన్నారు. భార్య డెలివరీకి వెళ్లిన సమయంలో వేరే అమ్మాయిని తీసుకొచ్చి, వివాహేతర సంబంధం గడిపి తర్వాత చంపి డ్రమ్ములో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఢిల్లీలో కూడా ఇదే విధమైన ఘటన జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి హంతకుడిని శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఐదవ జోన్ నాయకులు కామేశ్వరి, లక్ష్మి, శ్రీదేవి, మంగవేణి, జ్యోతి పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-పెందుర్తి : మండల పరిధి నరవలోని విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో ఓటర్ నమోదుపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, దాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని తెలిపారు. ఓటు నమోదులో ఏమైనా సందేహాలుంటే నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ శ్రీను, కళాశాల ప్రిన్సిపల్ వి శ్రీధర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వీరునాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం కార్యకర్తలు

ఆశా వర్కర్ల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : విజయనగరంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్ల 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆశ వర్కర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహాసభ పోస్టర్‌ను ఆశ వర్కర్ల యూనియన్ (సిఐటియు) ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ల వద్ద ఆవిష్కరించారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ నినాదాలు చేశారు.

1 నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

ప్రజాశక్తి-లీగల్ విలేకరి: ఏపీలోని జిల్లా కోర్టుల్లో ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం జిల్లా కోర్టుల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు డిసెంబర్ 21, 22, 23, 29, జనవరి 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, టైపిస్టు, ఫీల్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఈ నెల 21, 22, 23, 29, జనవరి 2వ తేదీన, కాపీయిస్టు, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఈ నెల 26వ తేదీన, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ఈ నెల 26, 27, 28, 29 తేదీలలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి అభ్యర్థులు hc.ap.nic.in లేదా districts.ecourts.gov.in/andhrapradesh వెబ్‌సైట్ల నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ ల్యాండ్ లైన్ నెంబర్ 0863- 2372752ను సంప్రదించాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా భర్తీ ప్రక్రియ ఉంటుందని, ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి వారి మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే జిల్లా కోర్టు దృష్టికి, లేకుంటే హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మహాసభనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి -ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ 9వ మహాసభ వెంకన్నపాలెం కార్యాలయంలో కె.సూర్యనారాయణ ప్రాంగణంలో నిర్వహించారు. సిఐటియు జెండాను యూనియన్ నాయకులు కె.నూకరాజు ఎగురవేశారు. కె.సూర్యనారాయణ, ఎన్.శ్రీనివాసరావు, రామునాయుడు, బి.సూర్యనారాయణ చిత్రపటాలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, సీనియర్ నాయకులు కె.నూకరాజు, పైడిరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. కె.పెంటారావు, ఎస్.ప్రసాద్, ఎన్.ఉమ అధ్యక్ష వర్గంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎం శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. యువతకు ఉపాధి, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లలోపు సర్వీసు ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. మూడేళ్ల కార్యకలాపాల నివేదికను జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని, కాలుష్యాన్ని అరికట్టాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలు తీర్మానాలు చేశారు. మహాసభలో 28 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

నూతన కమిటీ

నూతన కమిటీ అధ్యక్షులుగా కె.పెంటారావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.లక్ష్మణమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.పైడిరాజు, టి.అప్పారావు, జె.రామునాయుడు, గోపాల్, సహాయ కార్యదర్శిగా జి.నరేష్, ఎస్.ప్రసాద్, కె.రమణ, జి.రమణ, పి.సురేష్, ఎ.సత్యారావు, కోశాధికారిగా వి.బాబూరావు, కె.నూకరాజు ఎన్నికయ్యారు.


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు బృందం

భెల్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -గాజువాక : భెల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేట్ డైరెక్టర్ రేణుక గేరాను సిఐటియు నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన్ను కలిసిన వారిలో సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్, ఎస్.జగన్నాథరావు, ఎస్.అప్పారావు, కృష్ణమూర్తి ఉన్నారు.

త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖపట్నం : త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ఏర్పాటుచేసి దాని విధివిధానాలను ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సిరిపురం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో విన్నర్స్, రన్నర్స్ 450 మందికి సర్టిఫికెట్లు, బహుమతులను కలెక్టర్ అందజేశారు. అర్హులైన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహనాలు, నలుగురికి లాప్ ట్యాప్‌లు, ఇద్దరికి టచ్ ఫోన్లను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి పథకం కింద మరో ముగ్గురికి రూ.8 లక్షలు పంపిణీ చేశారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, డిఇఒ చంద్రకళ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం జివిఎంసి 16వ వార్డు కెఆర్ఎం కాలనీలో ఆయన ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు.

నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కులో నూతన వేతనాలు అమలు చేయాలని యూనియన్‌లకతీతంగా ఉక్కు నూతన కార్మికుల ఎల్ అండ్ డిసి ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, 2017 సంవత్సరం నుంచి నూతన వేతనాలు అమలు జరగాల్సి ఉన్నా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్‌జెసిఎస్‌లో వేతన ఒప్పందం జరిగి ఏడాది గడుస్తుందని, ఇప్పటికే సెయిల్ ఉక్కు కర్మాగారాలలో కొత్త వేతనాలు అమలవుతున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కులో కూడా కార్మికులందరికీ కొత్త వేతనాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న పది రోజులలో మొత్తం యువ కార్మికులందరూ సంతకాలతో యాజమాన్యానికి వినతి సమర్పించాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా కాపాడడంతోపాటు, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం కూడా యూనియన్లు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వందలాది యువ కార్మికులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలను ఆపేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం వాసుదేవన్‌నగర్‌లో తన పేరు వాడుకుంటూ అనధికారికంగా నిర్మిస్తున్న భవనాన్ని నిలిపేయాలని కార్పొరేటర్ కంపా హనోక్ అధికారులకు ఫిర్యాదుచేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులిస్తే స్థానిక కార్పొరేటర్‌కు చెప్పి పనిచేసుకుంటున్నానని తెలపడంతో ఈ ఫిర్యాదు చేసినట్లు హనోక్ తెలిపారు.

చెరుకు తోటలకు తెగుళ్లు

★ మొక్కదశలోనే ఎర్రగా మారి చచ్చిపోతున్న వైనం
★ ఎదుగుదలా అంతంతమాత్రమే
★ పట్టించుకోని సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం



చౌడువాడలో ఎర్రగా మారుతున్న చెరుకు తోట

ప్రజాశక్తి- కె.కోటపాడు

చెరకు పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. మొక్క, రెండు మూడు జడలు దశల్లోనే తెగుళ్లు సోకి ఎర్రగా మారిపోయి తోటలు చచ్చిపోతున్నాయి. ఒక వైపు గిటుబాటు ధర లేక పెట్టిన పెట్టుబడి కూడా రాక సతమతమవుతుండగా, మరోవైపు తెగుళ్లతో చెరకు తోటలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కె.కోటపాడు మండలంలోని చౌడువాడ, మల్లంపాలెం, గుల్లేపల్లి, గొండుపాలెం, పైడంపేట, రొంగలినాయుడుపాలెం. మేడిచర్ల, ఎ.భీమవరం, కె.కోటపాడు, ఎ.కోడూరు, సూరెడ్డిపాలెం, వారాడతో పాటు మరికొన్ని గ్రామాల్లో 1750 హెక్టార్లలో ప్రస్తుతం రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఈ చెరకులో అత్యధిక భాగం చోడవరం (గోవాడ) చక్కెర కర్మాగారానికి సరఫరా చేస్తున్నారు. గతంలో పాతకొత్తతోట, 19, ఆబోతు, 7602, 7601 రకాల చెరకును రైతులు పండించేవారు. ఈ రకం చెరకు సుగర్ ఫ్యాక్టరీకి, బెల్లం తయారీకి లాభదాయకంగా ఉండేది. రైతులు 80 శాతం వరకు ఈ చెరకు సాగు చేసేవారు. అయితే ఈ రకాలకు తెగుళ్లు సోకి చచ్చిపోవడంతో చోడవరం సుగర్ ఫ్యాక్టరీ స్వల్పకాల రకాలైన బూంది, బిస్కెట్ మొదలైన రకాల చెరకును మొదటిలో రైతులకు సబ్సిడీపై ఇచ్చి ప్రోత్సహించింది. ఈ రకాలు నాటిన ఆరు నెలలకే పక్వానికి వస్తున్నాయి. పాత రకాల చెరకు దిగుబడి కంటే 50శాతం వరకు తక్కువగా ఉన్నప్పటికీ వేగంగా పంట రావడంతో పాటు తెగుళ్లను తట్టుకుంటాయనే ఉద్దేశంతో రైతులు ఈ రకాల చెరకును సాగు చేస్తున్నారు.

అయితే రెండు సంవత్సరాల నుండి ఈ రకాల చెరకు తోటలకు కూడా తెగుళ్లు సోకి చచ్చిపోతున్నాయి. కొన్నిచోట్ల నాటిన మొక్క నాటినట్లు ఉండిపోయి ఎర్రబారి, తరువాత చచ్చిపోతుండగా, మరికొన్నిచోట్ల రెండు మూడు జడలు వేసిన తర్వాత మడికి మడిలే చచ్చిపోతున్నాయి. ఈ విధంగా మండలంలో చౌడువాడలో ఇప్పటికే 25 శాతం వరకు చెరకు తోటలు తెగుళ్లు బారిన పడి ఎండిపోయాయి. రైతులు సేంద్రియ ఎరువులతో పాటు రసాయన ఎరువులు వాడినప్పటికీ ఈ చెరకు తోటల్లో ఎదుగుదల కనిపించలేదు. తెగుళ్లు నివారణ కావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బెల్లానికి ధర లేక, చోడవరం చక్కెర కర్మాగారానికి సరఫరా చేసిన చెరకుకు మద్దతు ధర లభించక, సకాలంలో పేమెంట్లు ఇవ్వక ఇబ్బందులు పడుతున్న రైతులు, తాజాగా చెరకు తోటలు చచ్చిపోతుండడంతో ఏమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. తెగుళ్లు సోకి చెరకు తోటలు చచ్చిపోతున్నా అటు చోడవరం చక్కెర కర్మాగారంగాని, ఇటు ప్రభుత్వంగాని తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో చెరకు సాగు పట్ల రైతులు అనాసక్తి చూపిస్తున్నారు. గతంలో మండలంలో 3వేల హెక్టార్లో చెరకు సాగు చేయగా, ప్రస్తుతం 1750 హెక్టార్లకు దిగజారింది. ప్రతి ఏడాది చెరకు సాగు తగ్గిపోతూ వస్తోంది. ఇప్పటికైనా చెరకు పంటకు సోకిన తెగుళ్లపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరీక్షించి రైతులకు సరైన సూచనలు, సలహాలు అందించి చెరకు తోటలను క్రిమి కీటకాల బారి నుండి రక్షించాలని, ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- చోడవరం

మండలంలోని జుతాడ, లక్కవరం, పిఎస్ పేట, చోడవరంలో బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ పఠాన్‌శెట్టి సుడిగాలి పర్యటన చేశారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. లక్కవరంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జుత్తాడ సచివాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయానికి ఉండటం లేదని, రాత్రి 9 గంటల దాటితే ఆసుపత్రిలో ఏ ఒక్కరు కనిపించలేదని స్థానికులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌డి శ్యాంసుందర్, తహశీల్దార్ తిరుమలబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి డాక్టర్లు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్నవారు వచ్చి పరీక్షించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి కేటరాక్ట్ ఆపరేషన్స్ చేయబడగాయని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవాళ్లు ఒరిజినల్ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు వాడచీపురుపల్లి, నాయుడు పాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తదితర పంచాయతీలను ఆనుకొని ఉన్న సుమారు 23 గ్రామాల్లో శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి అరుణ్ కుమార్, ట్రస్టు సభ్యులు సింగంపల్లి రామారావు మైక్ ప్రచారం, కరపత్రాలు పంపిణీ చేశారు.

తుపాను హెచ్చరికలతో వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి- దేవరాపల్లి

రాష్ట్రంలో తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతుల్లో ఆందోళన నెలకొంది. ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. ఇటువంటి సమయంలో తుపాన్ వార్త వారిలో ఒకింత భయాన్ని తెచ్చిపెట్టింది. వర్షం పడితే పొలంలో కోత కోసిన వరి చేను తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. బుధవారం సాయంత్రం తుపాన్ తీవ్రత పెరుగుతుందన్న భయాందోళనలతో ఇప్పటికే వరి కోతల కోసిన వారు వరిచేనును మడుల్లోనే కుప్పలు పెట్టే పనిలో బిజీగా ఉన్నారు. మరికొంత మంది కల్లాలకు తెచ్చి కుప్పలు పెడుతున్నారు. వరి కోతలు కోసి పంట అంతా నేలపై ఉందని, వర్షం పడితే తీవ్ర నష్టం తప్పదని రైతన్నలు వాపోతున్నారు.

వరి కోతలు వాయిదా వేయండి

కె.కోటపాడు : ఈనెల 9, 10 తేదీలలో వర్ష సూచన ఉన్నందున వరి కోతలు వాయిదా వేయాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి కోతలు ముమ్మరంగా కోస్తున్నారని, వర్ష సూచన ఉన్నందున వాయిదా వేయాలని సూచించారు. మళ్లీ ఎండలు వచ్చినప్పుడే వరి కోతలు మొదలు పెట్టాలన్నారు.



దేవరాపల్లిలో పొలంలోనే కుప్పలు పెడుతున్న రైతులు

38వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

- రూ.లక్ష విరాళం ఇచ్చిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - రాంబిల్లి

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేవల్ బేస్ నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం ఎన్ఎఓబి మెయిన్ గేట్ వద్ద చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 38వ రోజుకు చేరింది. ఈ ధర్నా శిబిరాన్ని జనసేన ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ అన్నయ్య, జనసేన పార్టీ నాయకులు సుందరపు సతీష్ కుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ ఉద్యమం నిమిత్తం లక్ష రూపాయలను నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు సతీష్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల ఉద్యమానికి జనసేన పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి నిర్వాసితుల సమస్యలను తన తమ్ముడు విజయ్‌కుమార్ తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పప్పల నూకన్నదొర, కోరుకొండ ప్రసాద్, చోడిపల్లి అప్పారావు, మెరుగు ప్రవీణ్ కుమార్, కారి నూకరాజు, 8 గ్రామాల పెద్దలు, నిర్వాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు సతీష్‌కుమార్

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి గనిశెట్టి



ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

పరవాడలో ఈ నెల 18, 19 తేదీల్లో జరుగు సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఫార్మాసిటీలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభ మొట్టమొదటిసారి పరవాడలో జరుగుతుందని, ఈ నెల 18న ఉదయం 10 గంటలకు పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్ నుంచి సంతబయలు వరకు భారీ కార్మిక ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.స్వరూప రాణి, జిల్లా నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం రెండు రోజులు పాటు పరవాడ సీతారామ కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్మిక చట్టాలు అమలు, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు తదితర సమస్యలపైనా, స్కీం వర్కర్లు, అసంఘటితరంగ కార్మికుల హక్కులకై సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహించినట్లు చెప్పారు.

మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ

అనకాపల్లి : పరవాడలో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం హైర్ బస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాలకు సిఐటియు మహాసభ దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి చిన్నారావు, అప్పారావు, జి వాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్‌ను సిఐటియు మండల కార్యదర్శి, ఐకెపి యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న తదితరులు బుధవారం దేవరాపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. దీనికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సృజన అప్పారావు, లక్ష్మి, లీలా, వరలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హైర్ బస్సు కార్మికులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నరసింగబిల్లి, బయ్యవరం రైల్వేస్టేషన్ మధ్య సైకిల్‌తో నడిచి రైల్వేస్టేషన్ లైన్ దాటుతుండగా రైలు ఢీకొని దుర్మరణం చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి అయిన నరసింగపల్లి, బయ్యవరం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి సైకిల్‌తో రైలు పట్టాలు దాటుతుండగా, ఎలమంచిలి వైపు నుండి అనకాపల్లి వైపు వస్తున్న రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 45 సంవత్సరాల వయసు గల పురుషుడు అక్కడికక్కడే మరణించాడు. ఆయన ఊరు పేరు తెలియ రాలేదు. లైట్ పసుపు రంగు గల ఫుల్ చేతులు చొక్కా, మెరెన్ రంగు గల షార్ట్ ధరించి ఉన్నాడు. ఇవి తప్ప మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని తుని గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. తుని రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ మారూఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9490619020, 9494887786 నెంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

నేడు మాడుగులలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని వి.మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 18 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని, పదవ తరగతి నుంచి డిగ్రీ, పీజీ, డిప్లమో, ఐటిఐ విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఏకపాత్రాభినయం పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఏకపాత్రాభినయం పోటీల్లో మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నంబారు హర్షవర్ధన్ ప్రతిభ కనబర్చారు. విశాఖపట్నం జిల్లా భీమిలి ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో జరిగిన కళా ఉత్సవ్‌లో హర్షవర్ధన్ అలరించారు. ఈ మేరకు హర్షవర్ధన్‌తో పాటు ఉపాధ్యాయుడు రాంబాబుకు కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యం నాయుడు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి, ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.రవీంద్రబాబు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఏకాభిప్రాయంతో 'ఇదేం ఖర్మ' నిర్వహిస్తాం

ప్రజాశక్తి -కె.కోటపాడు : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో పాటు మండలంలోని ముఖ్య నాయకులను కలుపుకొని ఏకాభిప్రాయంతో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షులు రొంగలి మహేష్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన టిడిపి మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు సాయంత్రం పూట నిర్వహిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు దాడి ఎరుకు నాయుడు, వెలగల పైడిమ నాయుడు, ఎంపిటిసి కసిరెడ్డి దేవుడు బాబు, టిడిపి నాయకులు బత్తి వెంకటరమణ, బండారు నరసింహానాయుడు, సబ్బవరపు రామునాయుడు, పూడి నారాయణమూర్తి, పూడి శ్రీనివాసరావు, కసిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అమృతపురం పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఇ.సందీప్ బుధవారం పరిశీలించారు. మామిడి తోటలో రింగ్ ట్రెంచ్ పనులను పరిశీలించి, కూలి డబ్బులు ఎంత వస్తుందని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఖాళీ సమయంలో అన్ని గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు మామిడి, జీడి మామిడి, కొబ్బరి, జామ మొక్కలు కావాలంటే వెంటనే గ్రామ సభల ద్వారా గుర్తించి, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు చేపట్టాలని సిబ్బందిని కోరారు. ప్రతి గ్రామపంచాయతీలోను పనులను గుర్తించి ఆమోదం తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన హౌసింగ్ లబ్ధిదారులకు 90 రోజులు పని దినాలు పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. ఉపాధి హామీ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మళ్ళ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి


మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-సబ్బవరం
మండలంలోని వేల ఎకరాలు ప్రభుత్వ భూములను కొంతమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు, అధికార పార్టీకి చెందిన వారితో కుమ్మక్కై ఆక్రమించి, ఆ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. బుధవారం మండలంలోని ఇరువాడ గ్రామంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాజు నివాసంలో బండారు విలేకర్లతో మాట్లాడారు. సబ్బవరంలోని 271, 255 260, 261, 266, 273, 277, 334, 335, 449, 286 తదితర సర్వేనెంబర్లలో ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించడమే కాకుండా పెద్దపెద్ద భవనాలు నిర్మించారని, మరికొన్ని స్థలాలను అమ్ముకుంటున్నారని తెలిపారు. అయినా వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఆరు నెలలుగా గ్రావెల్ మాఫియా మండలంలోని వెదుర్లనరవ, గంగవరం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ గ్రామాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ అండ చూసుకొని కబ్జాదారులపై తహశీల్దారు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు స్పందన ద్వారా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కలెక్టర్ కూడా స్పందించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, బర్నికాన బాబూరావు, గండి రవికుమార్, బొండా సత్యారావు, పివివిఎస్ఎన్.రాజు, కోటాన అప్పారావు, ఎంపీటీసీ గొర్లి కృష్ణ చైతన్య, కోరాడ శ్రీనివాసరావు, దొడ్డి సూర్య ప్రకాష్, పళ్ల తాతారావు, గవర అప్పారావు, బర్ల రమణ, అక్కుబాబు పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌కు తరలిపోతున్న పెట్రోలియం వర్సిటీ

మండలంలోని వంగలిలో ఏర్పాటు కానున్న పెట్రోలియం యూనివర్సిటీని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి తరలించుకుపోతున్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. వంగలిలో భూసేకరణ పూర్తయిందని, వర్సిటీ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అయితే ఇటీవల ఓ ప్రముఖ బీజేపీ నాయకుడు ఓ ప్రైవేట్ కార్యక్రమంలో తనను కలిసి పెట్రోలియం వర్సిటీ ఉత్తర ప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారని బాధ పడుతూ తెలిపారన్నారు. వర్సిటీ తరలిపోవడానికి స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడమే ప్రధాన కారణమన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి స్వయంగా కలుగజేసుకొని ప్రధానమంత్రితో మాట్లాడితే గాని పెట్రోలియం వర్సిటీ తరలింపు ఆగదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా తరలిస్తున్నట్లు తెలిపారు.

డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్ యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్ యూనిట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య యోజన సంపద పథకం కింద ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానికంగా చేపల వినియోగం పెంపు కోసం, తాజా లైవ్ ఫిష్, విలువ ఆధారిత చేపల ఉత్పత్తులు, రెడీ టు ఈట్ మత్స్య ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ఈ పథకాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ హబ్ అండ్ స్పోక్స్ పద్ధతిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఇన్సులేటెడ్ వాహనాలు, లైవ్ ఫిష్ వెడ్డింగ్ యూనిట్స్, విలువ ఆధారిత ఉత్పత్తుల అమ్మకం, మినీ ఫిష్ వెండింగ్ యూనిట్స్, ఫిష్ కియోస్కులు, ఫిష్ రిటైల్ మార్కెట్ నిర్మాణం కోసం ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. జనరల్ కేటగిరీలో 40 శాతం మహిళలకు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 60 శాతం బ్యాక్ అండ్ సబ్సిడీ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు నర్సీపట్నం 9390125477, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అనకాపల్లి 7036436968, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అచ్యుతాపురం 7416106750, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి నర్సీపట్నం 9494778347 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నాయీ బ్రాహ్మణ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మహేష్

ప్రజాశక్తి - దేవరాపల్లి : నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అనకాపల్లి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవరాపల్లికి చెందిన ఆతవ మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలమంచిలిలో బుధవారం జరిగిన సంఘం జిల్లా సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. మహేష్‌తో పాటు సంఘం గౌరవ అధ్యక్షులుగా జంపా సత్యం ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా మహేష్ తెలిపారు.

ఘనంగా దత్త జయంతి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ గౌతులచ్చన్న నగరం పవర్ సిటీలో శిరిడి సాయి సేవా ట్రస్ట్ చైర్మన్ వివి.పూర్ణానందరావు ఆధ్వర్యంలో దత్త జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం దత్తాత్రేయ, సాయిబాబా సాహిత భర్ద్వాజలకు సామూహిక క్షీరాభిషేకం, గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావును స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ ఘన సన్మానం చేశారు. స్థానిక నాయకులు పైలా రామారావు, జెర్రిపోతుల అప్పారావు, ఆర్ఆర్.నాయుడు, తమరాన శ్రీనివాసరావు, పోలమరశెట్టి కోటేశ్వరరావు, రాధాకృష్ణ, డి.శంకర్రావు, జీవిత ఈశ్వరరావు, వి.లక్ష్మీ భ్రమరాంబ, బి.సరస్వతి పాల్గొన్నారు.

గెడ్డ వాగులో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు


వినతిపత్రం ఇస్తున్న రావాడ పంచాయతీ ప్రజలు

ప్రజాశక్తి-పరవాడ
టిడిపి ప్రభుత్వ హయాంలో మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీలోని ఇళ్ల స్థలాల కేటాయింపులో జరిగిన అవకతవకలు, గెడ్డ వాగులో చేపట్టిన అక్రమ కట్టడాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీకి చెందిన వారు కొంత మంది బుధవారం తహశీల్దారు వి.ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎన్‌టిఆర్ కాలనీలో పేదలకు నాటి టిడిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించగా, వాటిని అప్పటి సర్పంచ్ వియ్యపు లక్ష్మి అండదండలతో టిడిపి నాయకులు వియ్యపు చిన్నా స్థానికంగా ఉన్న పేదవారికి కాకుండా వారికి నచ్చినవారికి ఇవ్వడంతో పాటు లక్షల రూపాయలకు అమ్ముకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రేఖవానిపాలెంలో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో సర్వే నెంబర్ 441, 442 మధ్యలో ఉన్న గెడ్డ వాగును చుక్క తాతారావు ఆక్రమించి శాశ్వతంగా గోడలు కట్టి తలుపులు పెట్టి అందులో బెల్లు షాపు నడుపుతున్నారని తెలిపారు. ధర్మారాయుడుపేటలో మేడిశెట్టి సోమునాయుడు, మోటూరు రామారావు స్థలం మధ్యలో గల సర్వే నెంబర్ 116-8లో 49 సెంట్లు కాలువను కప్పేసి ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. వీటన్నింటిపైనా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాము, మణిబాబు, డి.లింగరాజు, బొండా రాజు, మోటూరు లక్ష్మీపతి తదితరులున్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఏరువాక కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి, మినుము రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ప్రధాన శాస్త్రవేత్త, ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ బి.భవాని, సీనియర్ శాస్త్రవేత్త వి.గౌరీ మాట్లాడుతూ వరిలో రెల్ల రాల్చు పురుగు ఆశిస్తే నివారణకు 1500 పిపిఎం ఐదు మిల్లీ లీటర్లు, వేప నూనె లీటర్ నీటికి చొప్పున కలిపి సాయంత్రం వేళల్లో వరి కంకులపై పిచికారీ చేయాలని సూచించారు. వరి మాగాణిలో వరి కోయడానికి మూడు నుంచి ఐదు రోజుల ముందు మినుము విత్తనాలు వెదజల్లు కోవాలన్నారు. మినుములో పీబీజీ 104, ఎల్బీజీ 787, ఐపిఎం2-14, పియు 31, డబ్ల్యూజీజీ 42 రకాలను వేసుకోవాలని సూచించారు. విత్తనాన్ని ఇమిడా క్లోప్రిడ్ ఐదు మిల్లీలీటర్లు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయడం ద్వారా వైరస్ తెగులు, రసం పీల్చే పురుగు, తెల్ల దోమ పురుగు నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు వరి అనంతరం వేసే పెసర, మినుము, నువ్వులు, కూరగాయల పంటలపై సాంకేతిక సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ తిరుమలరావు, ప్రోగ్రాం సపోర్టర్ వివి రాము, సుమారు 70 మంది రైతులు పాల్గొన్నారు.



ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడుతున్న భవాని

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని ఆర్‌బికె సిబ్బందిని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎం.శ్రీలత ఆదేశించారు. మండలంలోని ఐదు క్లస్టర్ల ఆర్‌బికె సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసిస్టెంట్లు, రూట్ ఆఫీసర్లకు బుధవారం మండలంలోని ఎం.అలమండ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అనేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎల్వై కాంతమ్మ, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న శ్రీలత

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో భాగంగా సుస్థిర అభి వృద్ధి లక్ష్యాలు, గ్రామ ప్రణాళికలు తయారు చేయాలని, పేదరిక నిర్మూలన, వృద్ధుల, బాలికల ప్రణాళిక, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామ సభల ద్వారా రూపొందించి ఆమోదం పొందాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యంశాస్త్రి, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీషం నానాజీ, ఉపాధి ఏపీవో ఈశ్వరరావు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు .

రావికమతం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులందరూ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో వెంకన్న బాబు తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, అవి అబివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి రమణయ్య పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో అభివద్ధి పనులపై సర్పంచులకు, ఎంపిటిసిలకు, సచివాలయం సిబ్బందికి శిక్షణ తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణశ్రీ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీల అభివృద్ధికి ఖర్చు చేసే నిధులపై తీర్మానాలు తప్పని సరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డీ సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణశ్రీ



జెసికి వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు, తదితరులు

ఇళ్ల పట్టాలివ్వాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్య పేటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి రాజయ్యపేట పంచాయతీ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ బాబు, విద్యా కమిటీ చైర్మన్ బొందలపు అప్పలరాజు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైలపల్లి జాన్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు మైలపల్లి బాపూజీ, పిక్కి వెంకటేష్‌లతో కలిసి వినతి పత్రం అందజేశారు. రాజయ్యపేట గ్రామంలో జగనన్న ఇళ్ళు మంజూరైన లబ్ధిదారులు గృహాలు నిర్మించు కోవాలంటే హౌసింగ్ అధికారులు పట్టాలు కావాలంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులను ఇళ్ళు పట్టాలు ఇవ్వాలని అడిగితే అది ఫారెస్ట్ భూములు కాబట్టి సాధ్యం కాదని చెబుతున్నారని పేర్కొన్నారు. దీంతో పేదలు ఇళ్ళు నిర్మించుకోవడం సాద్యం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వాలు హయాంలో 500 మందికి పైగా ఇళ్ళు పట్టాలు ఇచ్చి, మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు ఇవ్వకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని జెసిని కోరారు.



భోజనశాలను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

నాడు - నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలం వ్యాప్తంగా ఇటీవల చేపట్టిన నాడు నేడు పనులను రాష్ట్ర పరిశీలకులు నాగేశ్వరరావు పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా మొదటి విడత నాడు నేడు పనులు పూర్తికాగా రెండో విడత కొన్ని గ్రామాల్లో పనులు చేపడుతున్నామన్నారు.పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని, అధికారులకు సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు నిధుల మంజూరు జాప్యం జరుగుతున్న విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

కైలాసపట్నంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం

ప్రజాశక్తి-కోటవురట్ల: కైలాసపట్నం గ్రామంలోని రాజగోపాలపురం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌కు జిల్లా పరిషత్ సభ్యురాలు ఉమాదేవి మంజూరు చేసిన నిధులతో పనులు చేయడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు దాదాపు నాలుగు లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు మాజీ జడ్పిటిసి సభ్యురాలు వెంకటలక్ష్మి తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే స్థానికులు సేద తీరేందుకు ఉపయోగ పడుతుందని మైదాన ప్రాంత గిరిజనులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్

11 అడుగుల పాము హతం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఏఎల్‌పురం ఎస్సీ కాలనీలో 11 అడుగుల జెర్రి గొడ్డు పామును మంగళవారం రాత్రి గ్రామస్థులు హత మార్చారు. ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక పోవడంతో చీకట్లో ఓ వ్యక్తికి పాము కనిపించింది. సమీప ఇంట్లో దూరేందుకు ప్రయత్నం చేయడంతో తరిమినా ఫలితం లేక పోయింది. దీంతో, చేసేది లేక యువకులు హత మార్చారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద భారీ జెర్రిగోడ్డు పామును హతమార్చడం ఇదే తొలిసారి అని గ్రామస్థులు తెలిపారు.




శంకుస్థాపన చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తకోట: రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో బుధవారం రహదారి విస్తరణ పనులను శంకుస్థాపన చేశారు. స్థానిక పెనుగొండ నూకేశ్వరరావు (హెచ్‌పి) పెట్రోల్ బంక్ నుంచి కొలతలను ప్రారంభించారు. చోడవరం నియోజక వర్గంలో బుచ్చయ్యపేట మండలం వడ్డాది నుంచి కొత్తకోట మీదుగా రోలుగుంట మండలం యలంకాయలపాలెం వరకూ రహదారి విస్తరణ కోసం న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్ నుంచి సుమారు రూ.98 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జెఈ జయరాజ్ మాట్లాడుతూ, బ్రిటిష్ కాలం నాటి మ్యాప్, కొలతల ప్రకారం సుమారు వంద అడుగుల మేర మార్కింగ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. గురువారం నుంచి అధునాతన సాంకేతిక యంత్రాలతో మార్కింగ్ పనులు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి పూడి దేవ పాల్గొన్నారు.

గ్రామాలను కమ్మిన మంచు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పలు గ్రామాలు నాలుగు రోజుల నుంచి మంచు ముసుగులో దర్శనమిస్తున్నాయి. ఉదయం పది గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తోంది. రోడ్డుపై ప్రయాణించే వారికి దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనిపించక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వాకర్స్ ఉదయం వేళలలో మంచుతో ఇబ్బంది పడుతున్నారు. చలి కూడా ఉండటంతో పల్లెల్లో చలిమంటలు వేసుకుంటున్నారు.



కురుస్తున్న మంచు

వైసిపి పాలనలో కుంటుపడిన అభివృద్ధి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్న



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి: వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనలో రాష్ట్రాభివృద్ధి అన్ని విధాలుగా కుంటుపడిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం చలో కలెక్టరేట్ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డిఆర్‌ఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో అంతా అవినీతి రాజ్యమేలుతుందన్నారు. అన్ని వర్గాలు ఆయన పాలనను ఛీదరించుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, కెఎస్ఎన్ఎస్.రాజు, వంగలపూడి అనిత, టిడిపి మాడుగుల ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జివిఎంసి 82వ వార్డు శ్రీరామ్‌నగర్ కాలనీ, మరిడిమాంబ నగర్ ప్రాంతాల్లో టిడిపి అర్బన్ జిల్లా కార్యదర్శి పోలవరపు త్రినాధ్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, టిడిపి నాయకులు కొణతాల రత్న కుమారి, పిట్ల రాజు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

నక్కపల్లి: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో బుధవారం తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. వైసిపి పాలనలో ఎక్కడా అభివృద్ధి నోచుకోలేదన్నారు. ధరలన్నీ ఆకాశాన్ని అంటాయని, దీంతో పేదలు, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ నాయకులు లాలం కాశీ నాయుడు, గింజాల లక్ష్మణరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని తురువోలు గ్రామంలో ఎంపీటీసీ బీల కోటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు పోతుల చిన్నంనాయుడు ఆధ్వర్యాన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కోటేశ్వరరావు, పైలా ముత్యాలనాయుడు, జి.కొత్తపల్లి సర్పంచ్ సూరి నాయుడు, కార్యకర్తలు పాత్రుని సురేష్, జగన్, శ్రీరామ్‌మూర్తి పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం : కుమార్

మాడుగుల: పేదలను వైసీపీ ప్రభుత్వం విస్మరిస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పివిజి కుమార్ విమర్శించారు. బుధవారం మండలంలోని తాటిపర్తి, గరికిబంధ గ్రామాలలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగుదేశం హయాంలో పేదలకు సంపూర్ణ న్యాయం జరిగిందని, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు కడుపు నిండా తిండి దొరికేదని ప్రస్తుతం ఇటువంటి పథకాలు లేక పేదలు ఆకలితో అల్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లబిల్లి శ్రీరామమూర్తి, జల్లి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.




సమస్యలు తెలుసుకుంటున్న పివిజి కుమార్

ఆర్‌పి.రాజు కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందజేత

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ: కొద్ది నెలల క్రితం కన్నుమూసిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కన్వీనర్ ఆర్‌పి.రాజు కుటుంబానికి సిపిఎం బుధవారం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.ఈశ్వరమ్మ, బిఎల్.నారాయణ ఈ మేరకు ఆర్‌పి.రాజు భార్య ధనలక్ష్మికి సాయం మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.నరేంద్రకుమార్, రంగమ్మ, కెఎం.కుమార్ మంగళం, జి.రమణ, పి.శంకరరావు, నాగరాజు, ఆర్‌పి.రాజు కుమారులు నవీన్, జీవన్ పాల్గొన్నారు. తమ ఇంటి పెద్ద దిక్కు కోల్పోయి, ఆర్థికంగా కష్టాల్లో ఉన్న తమను ఆదుకున్న సిపిఎంకు, పార్టీ సభ్యులకు రాజు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఆదర్శనీయుడు రాజు

ఆర్‌పి.రాజు గత ఏడాది ఆగస్టు 25న గుండెపోటుతో మరణించారు. ఆయన జీవితకాలంలో దళితులు, కార్మికులు, పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. ఈ క్రమంలో పలుమార్లు జైలు జీవితం అనుభవించారు. పోలీసుల లాఠీఛార్జీలు, కోర్టు కేసులు, ప్రభుత్వాల నిర్బంధాలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. నమ్మిన లక్ష్య సాధన కోసం చివరికంటూ నిలిచారు. తన కుటుంబ సభ్యులను కూడా ఈ బాటలో నడిపించారు. తన మృతి తరువాత పార్థివ దేహాన్ని దహనం చేస్తే బూడిదై ఎందుకూ పనికి రాకుండా పోతుందని భావించి జ్యోతిబసు దేహదాన సంస్థ ద్వారా కెజిహెచ్‌కు అందించాలని, తద్వారా అనేక మంది వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం వినియోగించాలని కుటుంబ సభ్యులను రాజు కోరారు. కుటుంబ సభ్యులు అమలు చేసి రాజు మార్గాన్ని అనుసరించి పార్థివ దేహాన్ని కెజిహెచ్‌కు అందించి మాట నిలబెట్టుకున్నారు.



ఆర్‌పి.రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సిపిఎం నేతలు లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

రాజు పేద కుటుంబం నుంచి ఉద్యమంలోకి వచ్చారు. ప్రజలే కుటుంబంగా భావించారు. ఆయన మరణించే నాటికి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. ఈ స్థితిలో ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పిలుపు రావడమే తడవుగా పార్టీ సభ్యులు స్పందించారు. రూ.200 నుంచి రూ.50 వేలు వరకు విరాళాలు అందించారు. రాజు లేకపోయినా ఆయన కుటుంబం మాది, ఆ కుటుంబం కోసం మేమున్నామని సభ్యులు ముందుకొచ్చారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే రూ.2500 పెన్షన్‌తో జీవిస్తున్న కృష్ణవేణి అనే ఒంటరి మహిళ తన పెన్షన్ నుంచి రూ.500 విరాళమిచ్చి ఉద్యమ సహచరులకు స్ఫూర్తినిచ్చారు. ఈ విధంగా రూ.5 లక్షలు వసూలైంది. పార్టీ సభ్యుల నుంచి మాత్రమే విరాళాలు సేకరించాలన్న సిపిఎం పిలుపునకు స్పందించి విరాళాలు అందించిన ప్రతి ఒక్కరికీ పార్టీ విశాఖ జిల్లా కమిటీ ధన్యవాదాలు తెలియజేసింది.

సెవెన్ హిల్స్‌లో గుండె పదిలం

ప్రజాశక్తి-కలెక్టరేట్: 34 ఏళ్లుగా రోగుల ఆరోగ్య సంరక్షణలో సేవలు అందిస్తున్న తమ సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో కార్డియాలజీ, కార్డియాక్ సర్జరీనందు ఉత్తమ ఫలితాల కోసం సమగ్రమైన గుండె సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఆధునిక గుండె చికిత్సల కోసం అత్యంత నిష్ణాతులైన వైద్య బృందాన్ని నియమించామని ఆసుపత్రి వింగ్ కమాండర్ ఎంకె.బోస్ తెలిపారు. సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగంలో డాక్టర్ ఎం.నరేంద్రనాథ్ రాజు అత్యంత అనుభవశాలి అని, పేరొందిన సీనియర్ ఇంటర్వేన్షన్ కార్డియాలజిస్ట్ అని చెప్పారు. డాక్టర్ డి.రాకేష్, డాక్టర్ ఎం.నరేంద్రనాథ్ రాజు, డాక్టర్ డి.రాజేష్, డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎల్.హరిత కుమారిలతో కూడిన బృందం మెరుగైన సేవలు అందించనుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్ జివి.రమణ కుమార్, హెచ్‌ఒడి డాక్టర్ దెబాసి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

అధికారుల పనితీరుపై జెసి అసంతృప్తి

ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర
ఎలక్ట్రికల్ ఎఇకి షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి-నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గం లో జగనన్న లేఅవుట్లకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిని బట్టి చూస్తే అధికారుల పనితీరు సక్రమంగా లేదని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం పాయకరావుపేట నియోజకర్గం నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒ, హౌసింగ్, విధ్యుత్, ఆర్‌బ్లుఎస్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న లేఅవుట్లపై సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆయా మండలాల్లో జగనన్న లే అవుట్లకు సంబందించి వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఎంత మంది ఇల్లులు నిర్మించుకున్నారు. లే అవుట్లలో సమస్యలపై ఆరా తీసారు. మండలాల వారీగా అధికారులు సమస్యలను జెసి దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న లే అవుట్‌లలో ఇలు_లేని వారందరికీ ఇల్లులు నిర్మించి ఇవ్వాలన్న దృఢ సంకల్పంతో ఉందని, అధికారులు పనితీరు మాత్రం సక్రమంగా లేదన్నారు. లే అవుట్ లలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలు కూడా మండల స్థాయి అధికారులు పరిష్కరించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగ వంతం కాలేదన్నారు. లబ్ధిదారులకు సకాలంలో సెమెంట్లు చెల్లించలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణ విషయంలో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు సరిష్కరించడంతో పనులు వేగంగా జరిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. లే అవుట్లలో విధ్యుత్, తాగునీరు, డ్రైనేజి, రోడ్ల సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణాల వేగవంతం పై కీలకపాత్ర పోషించాలన్నారు. నక్కపల్లి లే అవుట్ లో వీధి లైట్లకు సంబంధించిన లైన్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ఎలక్ట్రికల్ ఎఈ కృష్ణ ను అడగగా, ఆయన ఇచ్చిన సమాధానంపై జెసి అసంతృప్తి వ్యక్తం చేసి మండిపడ్డారు. వెంటనే ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిసికి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలని, లే అవుట్ లలో నెలకొన్న సమస్యలను అధిగమించి, ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జెసి హెచ్చరించారు.



హౌసింగ్ పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెసి కల్పనా కుమారి

జెసి దృష్టికి పలు సమస్యలు

మండలంలో లే అవుట్, ఇతర సమస్యలను ఎంపిపి రత్నం, జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజి, మండల పరిషత్ కోఆప్సన్ సభ్యులు లొడగల చంద్రరావు, సర్పంచ్ సాధిరెడ్డి శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు జెసి కల్పానా కుమారి దృష్టికి తీసుకువెళ్లారు. పలు గ్రామాల్లో కేటాయించిన లే అవుట్‌లు ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేదన్నారు. వేంపాడు, అమలాపురం, డొంకాడ, వెదుళ్లపాలెం, రేబాక తదితర గ్రామాల్లో అనుకూలంగా లేవన్నారు. ఇల్లు నిర్మించుకున్న వారికి సకాలంలో పేమెంట్లు అందలేదన్నారు. దేవవరం జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ రాఘవకుమారి కోరారు. గొడిచెర్లలో గెడ్డ పూడికతీత పనులు చేపట్టాలని సర్పంచ్ అల్లు పార్వతి కోరారు. సక్కపల్లిలో సర్వే నెం237లో 19 ఎకరాల ఎండోమెంట్లో 22(ఏ)లో సమోదు కావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజి వినతిపత్రం అందజేసారు. న్యాయంపూడిలో సర్వే నెం 105-2లో 30 సెంట్లు భూమిలో సబ్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించడం జరిగిందని, ఈ మధ్య కాలంలో కొంత మంది భూమిని కాజేయాలని ప్రయత్ని స్తున్నారని, సర్వే చేసి ఆ భూమిని పంచాయతీకి అప్పగించాలని సర్పంచ్ రెడ్డి వరహాలబాబు, ఎంపిటిసి సభ్యులు ఆకేటి గోవిందరావు కోరారు. నెదుళ్లపాలెంలో నాడు - నేడు కింద పాఠశాల నూతన భవనం నిర్మించ డానికి శిథిలంలో ఉన్న భవనాన్ని తొలగించడానికి అనుమతివ్వాలని వెదుళ్ళ వెంకట రమణ కోరారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యం

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: మున్సిపాలిటీలోని 16, 21 వార్డుల్లో బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ముందుగా 16వ వార్డు శారదానగర్లో సుమారు రూ.7.50 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం 21వ వార్డు శ్రీరామ్మూర్తి వీధిలో సుమారు రూ.10లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ఉమా శంకరగణేష్ సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, 21వ వార్డు కౌన్సిలర్ వినీల చైతన్య, వైసిపి పట్టణ అధ్యక్షులు ఏకా శివ, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది. పాల్గొన్నారు.



జ్ఞాపిక. ప్రశంసా పత్రం అందజేస్తున్న డైట్ ప్రిన్సిపల్

రాష్ట్ర స్థాయి పోటీలకు దేవీ ప్రసాద్ ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి: విద్యాశాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కళాఉత్సవ్ 2022లో భాగంగా జిల్లా స్థాయి పోటీలలో నక్కపల్లి హైస్కూలు విద్యార్థి జి.దేవీప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. భీమునిపట్నం డైట్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీలలో కాంగో వాద్యంలో దేవీప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డైట్ శిక్షణ కేంద్రంలో బుధవారం డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు చేతుల మీదుగా దేవీప్రసాద్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఈనెల 12న రాష్ట్రస్థాయి పోటీలలో దేవీప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

హెచ్‌ఐవిపై కళా జాతా

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆ దేశాల మేరకు చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని వేములపూడి సంత మార్కెట్లో బుధవారం కళాజాతా నిర్వహించారు. వాచ్ఐవి వ్యాపి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత బృందం నాటక రూపకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చినబాబు, సచివాలయ సిబ్బంది పి.అంబిక, సమీద తిరుమల పాల్గొన్నారు.